# ముఖవిలాసం మించి . . .

“క్లిక్!”

నల్ల ముసుగులో ఉన్న తలని బయటకి లాగి మాణిక్యం ఒక పెద్ద నిట్టూర్పు వదిలాడు. అతని ఎదుట పెద్దలు, పిల్లలు కూర్చొనివున్నారు. తన్ను వాళ్ళు ఎంతవరకు శోధిస్తున్నారని అతనికే కదా తెలుసు?

ఒక నిమిషం అమరికగా కూర్చున్న గుంపు ఇప్పుడు చురుకుగా చెదరిపోయింది.

“ఫోటో బాగా వచ్చిందా?” అని అడిగారు, ఒక నడివయస్సు వ్యక్తి.

“దానిగురించి మీకేం విచారం వద్దు!”

“ఫోటో ఎప్పుడిస్తారు?” ఇది ఒక యువతి అడుగుతున్న ప్రశ్న; మరెవరికి ఇంత తొందర?

“రేపు సాయంకాలం ఇస్తాను.”

“అంత ఆలస్యం అవుతుందా?” ఇది ఒక యువకుడు అహంకారంతో అడిగే ప్రశ్న.

“అవుతుంది సార్.”

“కొంచెం touch చేసి ఇవ్వండి,” అని వేడుకున్నారు ఒక ముసలాయన తన మొహంలోని రేఖలు తడుముకుంటూ. ఫోటోలో ఆ రేఖలు ప్రధానంగా కనిపించకూడదని అతనికి బెంగ. అసలు వయస్సుకి, చపలంకి, ఎటువంటి పొత్తూ లేదు కాబోలు!

“సరేలేండి, అలాగే చేస్తాను.”

“నా చొక్కాయిలోని నీలి రంగు పువ్వు ఫోటోలో కనిపిస్తుందా?” అని ఒక ఐదేళ్ళ అమ్మాయి ఆతురతతో మాణిక్యంని అడిగింది.

మాణిక్యం జవాబు చెప్పడానికి ముందే ఆ గుంపులో ఒక అబ్బాయి “ఏమే జడ్డి, నీకేం మతి పోయిందా? తెల్ల చొక్కాయిలో ఉన్నది ఫోటోలో కనిపిస్తుందా?” అని ఆ అమ్మాయిని ఎగతాళి చేసాడు.

“ఏం, ఎందుకు తెలీదు? నీ బుష్ కోటు మాత్రం కనిపిస్తుందా?”

“ఊరుకో, జగడమాడితే తలమీద బాతుతాను, జాగ్రత్త!”

“నేను నీ చెవిని గిల్లుతాను!”

“ఏయ్, ఏయ్, ఊరుకోండి, గోలపెట్టవద్దు!”

‘దేవుడా, నేను వీళ్ళని వదలుకోడం ఎప్పుడు?” అని మాణిక్యం వాపోయాడు. ‘ఫోటోకి సముచితంగా కూర్చోడానికి ఈ గుంపు చేసే అల్లరి! . . . అబ్బబ్బా . . . స్టూడియోలో కేమెరా ముందు వచ్చి నిలబడితే మానవుడుగా కాదు, అసలు యంత్రంలాగ మారిపోవాలి!’

“అలాగైతే, రేపు సాయంకాలం వచ్చి ఫోటో తీసుకుంటాను.”

“సరే, సార్.”

సందడి, వాదనలు, ప్రతివాదనలు, పిల్లల పోట్లాటల తరువాత ఆఖరికి గుంపు నిష్క్రమించింది.

మాణిక్యం అలసటతో మొహం తుడుచుకున్నాడు. స్టూడియో బయట నిద్రపోతున్న కుర్రవాడిని లేపి, కూర్చోమని చెప్పి, పక్కనే ఉన్న చీకటి గదికి వెళ్ళాడు.

పదినిమిషాలు తరువాత బయట సందడి వినిపించింది; ఫోటో తీసుకోవాలని కొత్తగా వచ్చారు కొందరు.

మాణిక్యం అలసటని వదులుకొని, చిరునవ్వుతో, బయటకి వచ్చాడు.

"రండి సార్."

ఒక పెద్దాయన, ఎత్తుగా, నల్ల ఛాయలో కనిపించారు. సాంప్రదాయక పంచెకట్టు; బనియన్ కనిపించే విధంగా ఒక మస్లిన్ జిబ్బా, దాని మీద ఒక అంగవస్త్రం. నెత్తిమీద వీభూది, దానికింద ఒక చిన్న చందన బొట్టు. అతను సమాజసేవలో ఏదో ఉద్యోగం చేస్తున్నారట; వచ్చేవారం ఒక పేరు మోసిన పత్రిక అతని ఫోటో ప్రచురించబోతుంది. అందుకోసమే అతను వచ్చారు.

"ఫోటో బాగా తీయండి" అని అన్నారు అతను, బెంగతో.

"దానికేం . . . ఇదిగో, ఈ తెరలు చూడండి . . . నేపధ్యంలో మీకు ఎది కావాలి?"

మాణిక్యం ఏటవాలుగా ఉన్న ఒక చెట్టుని అతనికి చూపించాడు. కొన్ని పక్షులు ఎగురుతున్న ఆ చిత్రకళ చూడగానే అతను "ఇది వద్దు, నేను పక్షులగురించి ఏదీ చదవలేదే?" అని అన్నారు.

"అలాగైతే ఇది చూడండి."

ఇంకొక తెరలో ఒక చెరువుగట్టు, కొన్ని చెట్లు ఉన్నాయి. 'నేనేం ప్రకృతిని వర్ణించే చిత్రకారుడు కాదే?' అని అతను అడుగుతారేమో? అని మాణిక్యంకి అనుమానం కలిగింది. కాని ఎందుకోగాని అతనికి ఆ దృశ్యం నచ్చింది.

"ఇది బాగుంది . . . ఇక్కడ అద్దం ఏదైనా ఉందా?"

"అదిగో, ఆ చిన్న గదిలో ఉందే?"

మాణిక్యం సూచించిన ఆ గదిలో ఒక మేజా, దానిమీద దువ్వెన, పౌడరు, ఉన్నాయి; గోడమీద ఒక నిలువటద్దం, పక్కనే కోట్ హ్యాంగర్ లో కొన్ని కోట్లు. పెద్దాయన ఆ గదికి వెళ్ళి అద్దం ముందు తన అందంని కొంచెం పెంచుకొని, తృప్తితో బయటకి వచ్చారు.

"నేను రెడి."

"కూర్చోండి."

ఇది రోజువారి నడిచే నాటకం:

"కొంచెం ఇలాగ తిరగండి."

"కొంచెం తలెత్తి చూడండి."

"పక్కకి ఎక్కువగా వంగవద్దు."

"కొంచెం నవ్వాలి . . . "

"నవ్వు ఎందుకండీ? సమాజసేవలో నవ్వడానికి టైమెక్కడ దొరుకుతుంది?"

"ఐనాకూడా, ఫోటోకి . . . "

"ఇది మించి నాకేం వద్దండి."

మాణిక్యం ఒపికతో తన పని చెయ్యసాగాడు. ఫోటో తీసే సమయం అతను "కొంచెం ఆగండి" అని అన్నారు.

"ఏంటి సార్?"

"పక్కనే ఒక మేజాలో కొన్ని పుస్తకాలు ఉంటే బాగుండదు?"

'సమాజ సేవకుడుకి చదవడానికి టైముంటుందా?' అని మాణిక్యం అతన్ని అడగలేదు, కాని మనసులో అనుకున్నాడు.

"ఇవన్నీ ఏం పుస్తకాలు?"

"మీరే చూడండి" అన్నాడు మాణిక్యం.

"ఇవన్నీ ఇంగ్లీషులో ఉన్నాయి. నాకు తమిళం మాత్రం తెలుసు . . . ఐతేనేం, ఫోటోపే కదా? ఏ పుస్తకమైనా సరే . . . "

అవును, నిజం. అంతా డాబు, ఆడంబరం. ఆ మాటకి వస్తే ఛాయాచిత్రకళ చేసేది జీవితంలోని వైఖరిని ఒక నిర్దయ పూతగా చిత్రించడమేకదా?

“ఫోటో రేపు సాయంకాలం దొరుకుతుంది. మీకు ఏ సైజులో కావాలి?”

“Cabinet size లో ఇవ్వండి.”

ప్రతీరోజూ ఇలాగే సాగుతోంది. జనులు రావడం, ఫోటో తీసుకోవడం అనేది బాహ్య వైఖరిని గుర్తించే ఒక కళగా, అందచందాలని ఒలకబోసే వాడుకగా ఐపోయింది. అదే తన ఉదరనిమిత్తంకి ఆధారం అని మాణిక్యం గ్రహించాడు. కాని అది మానవ సమూహాంని ఒక ఎత్తిపొడుపుగా - ఇంకా చెప్పాలంటే - ఓర్పుతో చూసి నవ్వే దృక్పథంగా - అతనికనిపించింది.

“రండి సార్.”

ఒక యువతీ యువకుల జంట; కొత్తగా పెళ్ళయిన జంట అని వేరే చెప్పాలా? ఇద్దరి మొహాల్లోనూ నవ్వు వర్ధిల్లుతోంది.

“పుష్పా, నువ్వు కూర్చో. నేను పక్కనే నిలబడతాను, అలాగే ఫోటో తీసుకుందాం.”

“హూహూం . . . ” అంటూ యువతి మొహం చిట్లించుకుంది. “బాగుంది! నేనే నిలబడతాను.”

“వద్దు. ఆ తరువాత నీ కాలుకి నొప్పి అంటే నాకే కదా అవస్థ?”

ఉత్సాహంతో ఆ యువకుడు పరిసరాలు మరిచిపోయాడు; కాని యువతికి ఆ ప్రజ్ఞ ఉంది. “ఊరుకోండి” అని అతన్ని మందలించింది.

“సరేలే, చేతులు పట్టుకొని నిలబడదామా?”

“అయ్యయ్యో, వద్దండీ!” ఆమెకి బాగా లజ్జ వచ్చేసింది. “ఇంటిలో అందరూ చూస్తారే? ముందు ఆ సెణ్బగం చూసి ఏమంటుందో?”

ఆ సెణ్బగం ఎవరో, ఆమె ఏమని చెప్పగలదో తెలీదు. కాని ఆ పేరు గుర్తుచేసుకొని ఇద్దరూ నవ్వుకున్నారు.

“కొంచెం దువ్వుకోవాలి . . . ”

“ఆ గదిలోకి వెళ్ళండి.”

అడిగినది యువతి. కాని యువకుడూ ఆమెతో వెళ్ళాడు. ఇదేదో త్వరగా ముగిసే పని కాదని మాణిక్యంకి తెలుసు; నిదానంగా ఒక సిగరెట్టు వెలిగించుకొని కూర్చున్నాడు.

అలంకార గదినుంచి సంభాషణ, నవ్వు వినిపించాయి. కొంచెం సమయం తరువాత దంపతులు బయటికి వచ్చారు. మాణిక్యంకి వాళ్ల స్వరూపంలో ఎటువంటి అభివృద్ధి కనిపించలేదు. అదేదో వాళ్ళ కళ్ళకే కనిపిస్తోంది కాబోలు!

సాయంకి మాణిక్యం కుర్రవాడిని పిలిచాడు.

భర్త పక్కనే ఒక చిన్న మేజాని కుర్రవాడు వేసాడు. భార్య దానిమీద ఎక్కి నిలబడిన తరువాత ఎత్తు యీడుగా కనిపించింది.

మొదట అలాగే ఒక ఫోటో తీసుకున్నారు. ఆ తరువాత, “ఇంకొక pose సార్!” అని అంటూ యువకుడు భార్య చెయి పట్టుకున్నాడు.

“ఆ మొదటి ఫోటో నేను ఇచ్చిన అడ్రసుకు పంపించేయండి . . . తరువాత ఆ రెండవ pose ని ఈ అడ్రసుకి పంపుతారా?”

తటాపటాయించుతూ సిగ్గుతో యువకుడు మరొక అడ్రసు అందించాడు. అది అతను పని చేసే కార్యాలయం అడ్రసు. చేతులు కలుపుకున్న దృశ్యం బంధువులకి కాదు. అది వాళ్ళిద్దరికి మాత్రమే.

“సరే సార్, అలాగే పంపుతాను.”

ఆ దంపతులు వెళ్ళిపోయారు. మరెవరో వస్తూనే ఉన్నారు. యంత్రంలాగ మాణిక్యంకి నియమబద్ధ పని సాగుతోంది. అందులో అతను ఒక పల్లు. 'అంతకు మించి నా వృత్తిలో లోతుగా ఒక నిమిషంకూడా లేదా?' అని అతను అంగలార్చుకున్నాడు.

ఇంతలో మరొక పెద్ద గుంపు వచ్చి గదిని ఆక్రమించుకుంది; ఒక క్షణం మాణిక్యం స్తంభించిపోయాడు.

"బిడ్డని ఫోటో తియ్యాలి. బాగా తీస్తారా?"

గుంపులో మగవారి, ఆడవారిమధ్య ఉన్న ఆ శిశువుని శ్రమతో మాణిక్యం కనిపెట్టాడు.

"తప్పకుండా . . . ఒరేయ్, ఆ మేజాని కేమెరా ముందు లాగు . . . పాపని మేజామీద వదలండి . . . "

"పాపకి మూడు నెలలే నిండాయి . . . బెదరు పడకుండా తీయాలి . . . "

మాణిక్యం కోపం అణచుకొని మేజామీద ఒక విరివి వేసాడు. "సరే, ఇక పాపని వదలండి."

పాపని మేజామీద వదిలారు. "ఏదీ, నవ్వు . . . " అని ఎవరో బతిమాలారు.

"ఏమండీ, ఆ సిల్కు చొక్కాయి ఫోటోలో వస్తుందా?"

"హుం, వస్తుంది."

"అందులోని ఆ పువ్వు చేతిపని - అది బాగా కనిపించాలి."

ఆవిడ కంఠధ్వని విన్నతరువాత ఆ చేతిపని ఆవిడే చేసారని బోధపడింది.

"బాబూ, నవ్వరా . . . ఇదిగో, కేమెరా చూడు!"

"ఫోటో వాళ్ళ నాన్నగారికి పంపాలి . . . బాగా తీయండి . . . "

మాణిక్యం ఇక భరించలేకపోయాడు.

"పాప తాతయ్య వచ్చి చూసినా ఫోటో బాగుంటుంది . . . మీరందరూ కొంచెం జరగాలి . . . "

"మరి పాప ఏడుస్తుందే . . . ?"

"అలాగైతే మీరందరూ కలిసి పాపతో కూర్చోండి . . . "

"అయ్యయ్యో, వద్దండీ . . . "

అందరూ జరిగారు, కాని మాట్లాడడం మానుకోలేదు.

"రాజు, ఏదీ, నవ్వు చూద్దాం!"

"కేమెరాని చూస్తే వాడికి భయంగా ఉంది . . . "

"బాబూ, ఇలా చూడు నాయనా . . . " అని ఒకతను పాపని ముద్దుగా పిలిచారు.

పాప నవ్వాలని ఒకావిడ తన మొహం ముడుచుకుంది.

ఈ గొడవలోనూ పట్టు చొక్కాయ చెమటలోనూ పాప ఏడవడం ఆరంభించింది. నవ్వు వచ్చింది - మాణిక్యంకి. పాప గురించి కాదు, దాన్ని నవ్వించాలని ఈ పెద్దలు వంకరటొంకరగా చేసేవన్నీ ఫోటో తీస్తే ఎంత మజాగా ఉంటుందని ఆలోచించాడు.

"అమ్మోయ్, పిల్లవాడు ఏడుస్తున్నాడే!"

"నేను ముందే చెప్పలేదూ - పిల్లవాడికి orange juice ఇచ్చి తీసుకురమ్మని? నా మాట ఎవరు విన్నారు?"

"మరేం లేదు. అది సగం నిద్రలో ఉంది. ఇవాళ ప్రొద్దునే లేచిందికదా?"

"నిన్న సాయకాలమంతా పూర్తిగా నిద్రపోయిందే?"

"అంటే ఇవాళ ఉదయం త్వరగా మెలకువ రావాలాంటున్నావా? నీకన్నీ తెలిసినట్టు మాటాడుతున్నావే?"

"నేను నలుగురు పిల్లలు కన్నాను. నాకు నువ్వు పాఠం నేర్పుతున్నావా?"

అందరికీ సొంత ఇంటిలో మెలుగుతున్నట్టు ఒక భావన. ఆఖరికి మాణిక్యం స్టూడియోలో ఉన్న కొన్ని బొమ్మలు చూపించి ఎలాగో ఒక విధంగా పాప ఏడ్పుని ఆపి పాప ఫోటో తీసాడు.

"పాప అందంగా కనిపిస్తుందికదూ?"

అందం! అందం! ఎప్పుడూ అదే లక్ష్యం! ఈ ప్రపంచంలో బాహ్య స్వరూపం తప్ప మరేం లేదా? ఆ బాహ్య స్వరూపంకి ప్రాధాన్యం ఇచ్చే ఛాయాచిత్రకళకి దయ అంటూ ఏమీ లేనేలేదా?

"తప్పకుండా . . . మీకేం విచారం వద్దు."

ఇలాగే ఎన్ని రోజులు! కుటుంబం, వ్యాపారం, పెళ్ళి, పిల్లలు, పెద్దలు - ఏ ఫోటో కావాలన్నా సరే - ఇదే గొడవ . . .

"దువ్వుకోవాలి", "ఫోటో అందంగా వస్తుందా?" - ఇవే వాళ్లు నిత్యమూ అడిగే ప్రశ్నలు.

"ఫోటోలో మా అమ్మాయి బాగా రావాలి, అందంగా కనిపించాలండి . . . ఫోటో జాగ్రత్తగా తీస్తారా?" వేరే ఒక తల్లి మనోవేదన ఇది. ఆ అమ్మాయి అలంకరణ చూసే పెళ్ళి సంబంధం జరగాలని ఆ ఫోటోని వరుడు కుటుంబంకి పంపుతున్నారని తెలిసింది.

"ఇంతవరకూ నలుగురుతో చుట్టరికమంటూ ఏదీ జరగలేదు . . . 'మీ అమ్మాయి నలుపుగా ఉంది, మాకు వద్దు!' అనేసారు. అందంలో మా సరసాకి ఏమిటి తక్కువ? అందుకే ఇక ఫోటో పంపుదామని నిశ్చయం చేసుకున్నాం."

మనోవ్యధ భరించలేక ఆ తల్లి నిష్కపటంగా మాటాడుతోంది; ఒక అన్యుడుకి చెప్తున్నాం అనే ఆలోచన ఏ మాత్రమూ లేదు.

మళ్ళీ ఫోటో తీసే అవస్థ. "కొంచెం నవ్వండి", "కొంచెం ఇలా తిరగండి" అని సలహాలు. కూతురు చీరని తల్లి అభిమానంతో సర్దుతూ, ప్రతీచోటా పట్టు చీర జరీ అంచు పూర్తిగా కనిపించినట్టు దాన్ని విస్తరించింది; మెడలోని ఆభరణం చీర బయటికి లాగి స్థిరపరచింది. అంతేకాదు, ఆమెది తల్లి చెయి కదా? ఫోటోలో కనిపించని అంశం అనే ప్రజ్ఞ లేకుండానే వెనకటికి వెళ్ళి కూతురు తలలోని పువ్వునుకూడా సరిదిద్దింది.

"ఫోటో బాగా వస్తుందా? మా సరసా చక్కగా కనిపించాలి . . . ఏదైనా సరిదిద్దాలంటే చెయ్యండి . . . "

ఇలాగ కొంత మంది.

ఆ మరుదినం ఒక అమ్మాయి వచ్చింది. చీర మీద ఒక నల్ల వస్త్రం. ఇటీవల కాలేజీలో పరీక్ష పాసయింది. చెయిలో ఒక చదుర టోపి, ముడుచుకున్న డిగ్రీ పత్రం ఉన్నాయి. ఆ convocation ఉడుపులో తన విద్యని తెలియజేయాలని పూనుకుంది.

"మీకు స్క్రీన్ ఏ నేపథ్యంలో కావాలి?"

"చిత్రాలున్న స్క్రీన్ వద్దు. ఉత్తికే ఒక బట్ట చాలు."

ఒక చెయిలో డిగ్రీపత్రంతో, పువ్వులు నిండిన కలశం ఉన్న ఒక మేజాపై ఇంకొక చెయిని ఆనుకుంటూ ఆ అమ్మాయి నిలబడింది. ఆమె చూపు లోకప్పులో ఎక్కడో ఉంది. అదే తన విద్యకి తగిన చిహ్నం అని ఆమె ఉద్దేశం. ఆ నల్ల టోపి ఆమె తలపై ఎగతాళిగా కనిపించింది. కాని ఆమె బడాయిగానే నిలబడింది. ఇక ఆ డిగ్రీపత్రం పోగొట్టుకున్నా ఈ ఫోటోని ఆమె పోగొట్టుకోదు. తన విద్య ప్రకటనకి ఇదొక ఆడంబర సాధనం కదా? భవిష్యత్తులో ఎవడినో పెళ్ళాడి, ఇల్లూ, వాకిలీ అని ఏడవడానికి ఇదొక మెట్టు, అవునా?ఎందుకీ చదువు? బయటకి గొప్పలు చెప్పుకోడానికే . . .

ఆ తరువాత వచ్చినతను కూడా మాణిక్యం మనోవ్యధని ఏమాత్రం తగ్గించలేదు. అతని పాదరక్షలు సొగసుగా ప్రకాశించాయి; నిగనిగలాడే దిట్టమైన కేశంతో కనిపించాడు. తీసుకొనే ఫోటోలో తను కనిపించేది ఛాతీ వరకే, కాని అతను సుంకాలు విధించే ఒక అధికారి కొడుకట. ఉద్యావనశాస్త్రంలో పెద్ద చదువుకని అమెరికా వెళ్తున్నాడట. ఈ సంగతి అన్ని పత్రికల్లోనూ అతని ఫోటోతో ప్రచారం చేస్తారట.

అతని తండ్రిగురించి ఎవరికి తెలుసు? ఇతను విద్యాభ్యాసంకోసం ఎక్కడైనా వెళ్తున్నాడా లేదా అని ఎవరికి తెలియాలి? దానిగురించే ప్రజలందరూ తాపత్రయపడుతున్నట్టు అతనికి ఒక భ్రమ.

“ఫోటో బాగా రావాలి సార్ . . . Tip top గా కనిపించాలి . . . పత్రికలలో రాబోతుంది passport size లో . . . ”

“సరే సార్!”

ఆఖరికి అతను నిష్క్రమించిన తరువాత మాణిక్యం రుమాలుతో మొహంలోని చెమటని, చిరునవ్వుని, తొలగించుకున్నాడు: ‘ఇదేంటి - నకిలీ జీవితం! ఆడంబరం, అందం . . . ఎదైనా కళ్ళకి కనువిందుగా కనిపించాలి, మరేం వద్దు!’

గడియారంలో ఆరుగంటలని తెలిసింది. స్టూడియోని మూసి కొంచెం విశ్రాంతి తీసుకుంటే? అదొక చిన్న స్టూడియో; అతనే దానికి యజమాని; అతనే ఫోటోలు తీస్తాడు. కాని ఇవాళ చాలా అలసటగా ఉంది. నోటిలో ఒక సిగరెట్టుతో మాణిక్యం బయటికి వచ్చాడు.

“సార్!”

‘దేవుడా, ఇంకా ఎవరో వచ్చినట్టుంది - ఒక స్త్రీ, ఒక మగవాడు, స్త్రీ చెయిలో ఒక పాప . . . ’

“రేపు రండి . . . నేను బయటికి వెళ్ళాలి . . . ఇక్కడ మరెవరూ లేరు.”

ఆ మగవాడు భార్యని నిరాశతో చూసాడు.

“మేం చాలా దూరంనుంచి వస్తున్నామండి . . . సమయంకి బస్సు దొరకలేదు . . . ఇవాళ కాకపోతే మళ్ళీ రేపు శ్రమతో పిల్లవాడిని ఎత్తుకొని రావాలి.”

ఆమె తెగింపుతో మాటాడింది. “సరే, రండి . . . ” అని మూలుగుతూ మాణిక్యం మళ్ళీ లోపలికి వెళ్ళాడు.

మాణిక్యం కుర్రవాడికి చెప్పాడు: “ఆ stool ని ముందు పెట్టు”. తరువాత దంపతులని అడిగాడు: “మీరిద్దరూ నిలబడతారా, లేకపోతే పిల్లవాడిని ఒడిలో పెట్టుకొని కూర్చుంటారా?”

“కొంచెం తల దువ్వుకోవాలి . . . ” అని ఆ యువతి అడిగింది.

“అదిగో, ఆ గదికి వెళ్ళండి.”

బిడ్డతో తల్లి మాత్రం గదిలోకి వెళ్ళింది; భర్త వెళ్ళలేదు.

“మీరూ కావాలంటే వెళ్ళండి సార్ . . . మీరు కూడా కోటు మార్చుకోవచ్చు . . . ఇప్పుడు మీరు తొడుక్కున్న కోటుకంటే అది బాగా కనిపిస్తుంది . . . ” అని మాణిక్యం కొంచెం హేళనతో అన్నాడు.

“వద్దు. నేను ఫోటోకి నిలబడటం లేదు.”

“అంటే, తల్లీ, పిల్లవాడు  మాత్రం అన్నమాట! ఒరేయ్, ఆ stool తీసేయ్, ఒక కుర్చీ మాత్రం చాలు! నేపధ్యంలో మీకు ఏ తెర కావాలి? అందంగా కనిపించాలికదూ?”

చాలా రోజుల క్షోభలు మాణిక్యం మాటల్లో చెల్లాచెదరైయ్యాయి.

“బిడ్డని మాత్రం ఫోటో తియ్యాలి.”

“అంటే మేజా మాత్రం చాలు . . . ఒరేయ్, ఆ మేజాని ముందుకు లాగు!”

ఇంతలో తల్లి బయటకి వచ్చేసింది. చేతుల్లో బిగువుగా అణచుకున్న పాప తలనే ఆమె దువ్వింది, తన కేశంని కాదు.

“పాపని మేజామీద వదలండమ్మా . . . పాప కూర్చోగలదా, మంచిది! . . . చెయిలో ఏదైనా బొమ్మ ఇద్దామా? పాప ఫోటోలో ఇంకా అందంగా కనిపిస్తుంది . . . ”

“ఎలా కనిపించినా సరే.”

ఇప్పుడు ఆ మగవాడు మాటాడాడు.

“మా పాప నయంకాని రక్త వ్యాధితో బాధ పడుతోంది. ఇంకా రెండు మాసాలే దానికున్న ప్రాణం అంతా . . . అందుకే ఒక ఫోటో ఉంటే రోజూ చూస్తూ ఉండవచ్చు కదా అని . . .”

మాణిక్యం నోటినుంచి సిగరెట్టు జారింది: గభీమని ఒక దైవ పీఠం ముందు నిల్చున్నట్టు ఒక భావన:

తను దర్శించేది ఒక దుర్ఘటన . . . కాని . . .

ఈ ప్రపంచంలో నిర్దయకి చోటే లేదు! ఆడంబరంకి మధ్య ఎంత లోతైన భావన! కృత్రిమచేష్టలముందు యధార్థమైన ఒక తాపం! నిర్దయతో ప్రచారమే ఆధారంగా సాగిన తన వృత్తిలో ఇప్పుడు ఇద్దరు తమ అమితమైన దుఃఖంని భరించి తన్ను ఎలాగ ఓదార్చుతున్నారు!

మాణిక్యం అణగిపోయి, పావనుడై, గడ్డకట్టిపోయాడు.

వెక్కుతూ బిడ్డని మేజామీద వదిలేసి ఆ తల్లి జారుకున్నప్పుడు మాణిక్యం యంత్రంగా లేడు; మానవుడుగా మారిపోయి కేమెరా దగ్గరికి వెళ్ళాడు.

********